క్లుప్తంగా

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బోయినపల్లి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని మండల మధ్యాహ్న భోజన కార్మికులు గురువారం ఎంఈవో కార్యాలయంలో సిబ్బంది శ్రీపతి చంద్రమౌళికి వినతిపత్రం సమర్పించారు. ప్రధానోపాధ్యాయుల వేధింపులు లేకుండా చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు నర్సయ్య, నాని, కొమురయ్య, కవిత, లక్ష్మి, ఇమాంబీ, కోసవ ఎల్లవ్వ, కనుకవ్వ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్షా 16 వేలు విరాళం



విరాళం అందిస్తున్న చిక్కాల రామారావు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావు రూ.లక్ష 16 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు గజభీంకార్ రాజన్న, కోడి అంతయ్య, పెద్దూరి తిరుపతి, అంకారపు రవీందర్, మచ్చ ఆంజనేయులు, సామల రమేశ్, జలగం అమరేందర్ రావు, రాపెల్లి ఆనందం పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు పనులు పరిశీలిస్తున్న డీఈ శాంతయ్య

రుద్రంగి: మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఈ శాంతయ్య కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం ఆయన రోడ్డు పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ ఏఈ సతీశ్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో

కోనరావుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని సింగిల్‌విండో సీఈవో దుమాల కేశవులు అన్నారు. మండలంలోని కనగర్తి, వెంకట్రావుపేట, నిజామాబాద్, కొండాపూర్, కోనరావుపేట, వివంగాలపల్లి, ఎగ్లాస్‌పూర్, గొల్లపల్లి(నిమ్మపల్లి), బావుసాయిపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బండ నర్సయ్య, వైస్‌చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు రావులపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, హమాలీ సంఘం అధ్యక్షుడు లింగంపెల్లి హన్మాండ్లు, రైతులు పాల్గొన్నారు.

ఈజీఎస్ గ్రామసభ

రుద్రంగి: గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో ఈజీఎస్ గ్రామసభ నిర్వహించారు. వచ్చే సంవత్సరం ఉపాధి హామీ కూలీలకు పని దినాలు కల్పించేందుకు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాంచాయితీ కార్యదర్శి రాందాస్, ఈజీఎస్ సిబ్బంది, ఏఎస్ఎంలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకు మోక్షమెప్పుడో?

- బోయినపల్లి, జిల్లెల్ల సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంచే యోచన
- 33/11 కేవీ నుంచి 132/33 కేవీకి పెంచితేనే మెరుగైన విద్యుత్
- ట్రాన్స్‌కో సీఎండీకి ప్రతిపాదనలు

బోయినపల్లి: సిరిసిల్ల సెస్ పరిధిలోని బోయినపల్లి, జిల్లెల్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంచేందుకు ట్రాన్స్‌కో సీఎండీకి పంపిన ప్రతిపాదనలకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని ఈ ప్రాంత ప్రజలు వేచిచూస్తున్నారు. ఈ రెండు సబ్‌స్టేషన్ల విద్యుత్ సామర్థ్యం 33/11 కేవీ ఉండగా, వీటిని 132/33 కేవీకి పెంచడం వల్ల ఇతర మండలాల్లో సబ్‌స్టేషన్లకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసే వీలు ఉంటుంది. ప్రస్తుతం విద్యుత్ సామర్థ్యం తక్కువ ఉండడంతో నాణ్యమైన విద్యుత్ అందక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.



బోయినపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

దూరప్రాంతాల నుంచి సరఫరా

మండలంలో 23 గ్రామాలు, ఆరు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వేములవాడ మండలం మల్లారం 132 కేవీ సబ్‌స్టేషన్ 33 కేవీ లైన్ ద్వారా బోయినపల్లి, విలాసాగర్, వెంకట్రావుపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు, మండలంలోని కోరెం, స్తంభంపల్లి, మల్కాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లకు కొడిమ్యాల మండలం పూడూర్ 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి నిత్యం విద్యుత్ సరఫరా అవుతుంది. బోయినపల్లి మండలానికి అటు మల్లారం, ఇటు కొడిమ్యాల సబ్‌స్టేషన్లు సుమారు 20 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉంటాయి. అంత దూరం నుంచి విద్యుత్ సరఫరా చేస్తే బ్రేక్ డౌన్ అయినపుడు రిజిస్టర్ చేయడంలో ఇబ్బందిగా ఉందని సెస్ సిబ్బంది అంటున్నారు. ఎక్కడ బ్రేక్‌డౌన్ అయ్యిందో తెలుసుకోవడానికే కనీసం 3 గంటలు పడుతుందని తెలిపారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 11 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. జిల్లెల్లలో సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని కేటగిరిలి కలిపి సుమారు 27 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడికి ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి, సిరిసిల్ల పెద్దూర్ 132 కేవీ సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఇవి సైతం చాలా దూరంలో ఉండడంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా కావడం లేదని వినియోగదారులు తెలిపారు.

సీఎండీకి ప్రతిపాదనలు

దూరప్రాంతాల నుంచి విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడ్డపుడు, ముఖ్యంగా ఎండాకాలంలో రైతులతో పాటు, ప్రజలు, వ్యాపార వర్గాల వారు నానా తంటాలు పడుతున్నారు. ఈ ఇక్కట్లు తొలగించేందుకు ఈ రెండు సబ్‌స్టేషన్ల కెపాసిటీ పెంచాలని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ప్రతిపాదనలు పంపినట్లు సెస్ అధికారులు తెలిపారు. అలాగే విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావును సైతం కలిసి సమస్య విన్నవించారు. బోయినపల్లి, జిల్లెల్ల సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంచేందుకు గాను సరైన స్థలం, వసతులు ఉండడం సైతం కలిసి రానుంది. 33–11 కేవీ సామర్థ్యం ఉన్న బోయినపల్లి, జిల్లెల్ల సబ్‌స్టేషన్ల కెపాసిటీ 132/33 కేవీకి పెంచితే టవర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరిగి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా కానుంది.

19 వేల విద్యుత్ కనెక్షన్లు



మండలంలో 23 గ్రామాలకు ఆరు సబ్‌స్టేషన్లు ఉన్నాయి. కొడిమ్యాల మండలం నల్లగొండ, తిప్పాయిపల్లి గ్రామాలకు మల్కాపూర్ సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా అవుతుంది. మండలంలో 19 వేల వరకు ఉన్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం 33 కేవీ నుంచి 132 కేవీకి పెంచితే మెరుగైన విద్యుత్ అందుతుంది.

– జీ. ప్రశాంత్, సెస్, ఏఈ, బోయినపల్లి

సెస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లా



మండలానికి వేములవాడ మండలం మల్లారం ఫీడర్ నుంచి, కొడిమ్యాల మండలం పూడూర్ ఫీడర్ల నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. బ్రేక్ డౌన్ అయినపుడు సమస్యలు ఏర్పడుతున్నాయి. బోయినపల్లి సబ్‌స్టేషన్ సామర్థ్యం 132 కేవీకి పెంచాలని సెస్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లా.

– కొట్టెపెల్లి సుధాకర్, సెస్ డైరెక్టర్, బోయినపల్లి

ట్రాన్స్‌కో సీఎండీకి ప్రతిపాదనలు పంపించాం



జిల్లెల్ల, బోయినపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంచాలని ట్రాన్స్‌కో సీఎండీకి ప్రతిపాదనలు పంపించాం. అలాగే విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడితే సానుకూలంగా స్పందించారు. జనవరి నెలాఖరు వరకు అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉంది.

– చిక్కాల రామారావు, సెస్ చైర్మన్, సిరిసిల్ల

బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం



హరిదాస్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని హరిదాస్‌నగర్, వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలం లింగన్నపేట, సముద్రలింగాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను ఓటర్లకు వివరించి ఓటు వేయాలని అభ్యర్థించారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, మాజీ అధ్యక్షులు రాజారాం, దయాకర్‌రావు, మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ రాజిరెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం మాజీ కన్వీనర్ కొమిరిశెట్టి లక్ష్మణ్, మానేరు నీటి సంఘాల మాజీ చైర్మన్ వంగ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ వంగ సురేందర్‌రెడ్డి, గౌడ సంఘం మండల అధ్యక్షుడు చేరాల వెంకటస్వామిగౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు గోపాల్, ఉపసర్పంచ్ దుబాసి రాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలం బంజేరు, మద్దిమల్ల, మద్దిమల్ల తండా గ్రామాల్లో ఇంటింటి ప్రచారంలో నాయకులు రాజిరెడ్డి, చాంద్‌పాషా, జడ్పీటీసీ కళావతి, ఎంపిపి భూల, మహిళ నాయకురాలు కళ, సెస్ డైరెక్టర్ మల్లేశం, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వెంటే మేముంటాం



ముస్తాబాద్: యాదవులకు వెన్నంటి ఉండి గొర్రెలను ఇప్పించిన బీఆర్‌ఎస్ వెంటే తాము ఉంటామని సేవాలాల్‌తండా యాదవులు గురువారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఏ ప్రభుత్వం గొర్రెల కాపరుల సంక్షేమం, అభివృద్ధి చూడలేదని, ఒక్క సీఎం కేసీఆర్ మాత్రమే గొల్ల కురుమలకు అండగా నిలిచి ఆదుకున్నారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ కారు గుర్తుకే ఓట్లు వేస్తామని స్పష్టం చేశారు. ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ మహేశ్, డాక్టర్ చందర్, నాయకులు బాలయ్య, బాపురావు, మల్లేశ్, నర్సింలు పాల్గొన్నారు.

కేటీఆర్ దత్తత గ్రామంలో..



చీకోడులో ప్రచారం చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం చీకోడులో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చీకోడు అభివృద్ధికి మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధి పనులను గణాంకాలతో వివరించారు. పంచాయతీ, యువజన, మహిళా భవనాలు, సీసీ రోడ్లు, శ్మశానవాటిక, డంపింగ్ యార్డు పనులను చేశారన్నారు. విద్యాభివృద్ధికి అదనపు గదులు, తాగునీటికి ట్యాంకులను నిర్మించారన్నారు. ఇంకా పేదలకు ఆసరా పింఛన్లు, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించామన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, అంజన్‌రావు, రాజయ్య, దేవేందర్, అంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి, నేరెళ్ల, తంగళ్లపల్లిలో మండెపల్లి సర్పంచ్ గణప శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్న, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి గణప మదన్‌రెడ్డి ప్రచారం చేశారు.

గడప గడపకూ కాంగ్రెస్ నాయకుల ప్రచారం



కనగర్తిలో ప్రచారం చేస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా ఆధ్వర్యంలో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు రూ.500 లకే సిలిండర్ అందిస్తామన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలు అమలు జరిగాయన్నారు. సంక్షేమ ఫలాలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చేరాలంటే కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, నాయకులు వంగపెల్లి దేవరాజు, లింగం, తిరుపతి, రాజయ్య, శేఖర్, శంకర్, మహిపాల్‌రెడ్డి, రాజు, ఎల్లయ్య, బాల్‌రెడ్డి, తాళ్లపెల్లి ప్రభాకర్, బాస్కర్, శోభన్, సదానందం, అజీమ్, నందూ, వినయ్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికే ప్రాధాన్యం

బోయినపల్లి: రైతుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు చెన్నాడి అమిత్‌కుమార్ అన్నారు. మండలంలోని స్తంభంపల్లి, రామన్నపేట గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచులు మధు, జ్యోతి, ఎంపీటీసీ అక్కెనపెల్లి ఉపేందర్, ప్యాక్స్ చైర్మన్ తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, అక్కెనపెల్లి కరుణాకర్, సంబ లక్ష్మీరాజం, గుంటి శంకర్, శ్రీనివాసరెడ్డి, రంగి తిరుపతి పాల్గొన్నారు.



బోయినపల్లి: స్తంభంపల్లిలో ప్రచారం

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి వార్డులో అభ్యర్థి చల్మెడ లక్ష్మినర్సింహారావుతో పాటు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, వార్డు ప్రజలు, మహిళలు ప్రచారం నిర్వహించారు.

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపల్‌లో విలీనమైన శాత్రాజుపల్లి గ్రామంలో ఏనుగు మనోహర్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మినర్సింహారావుకు ఓటు వేయాలని అన్ని వార్డుల్లో ఇంటింటికి తిరిగారు.



కోనరావుపేట: బీఆర్‌ఎస్‌లో చేరిన నిజామాబాద్ కుల సంఘాల నాయకులు

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

రుద్రంగి: అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా గెలిపించి ఆశీర్వదించాలని రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మీనయ్య కోరారు. గురువారం వారు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మండల కేంద్రంలో ప్రచారం చేశారు. వేములవాడ ఎమ్మెల్యేగా చల్మెడ లక్ష్మీనర్సింహరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

కోనరావుపేట: మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన వివిధ కుల సంఘాల నాయకులు లంబ మల్లయ్య, సనుగుల తిరుపతి, దాప పర్శరాములు, బర్మ మహేశ్‌తో పాటు 60 మంది సంఘాల సభ్యులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, నాయకులు రాఘవరెడ్డి, మేర్గు లక్ష్మణ్, జీవన్‌గౌడ్, సాయి, జలేంధర్, యాదగిరి, ఎల్లయ్య, రవీందర్ పాల్గొన్నారు.

ఎల్‌ఈడీతో ప్రచారం

వీర్నపల్లి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రచార వాహనంలో ఎల్‌ఈడీ చిత్రంలో ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు వీడియో ద్వారా తెలియజేశారు.

నియామకం

డీసీసీ కార్యదర్శిగా గంజి జైపాల్‌రెడ్డి

వేములవాడ: రాజన్న సిరిసిల్ల డీసీసీ కార్యదర్శిగా వేములవాడకు చెందిన గంజి జైపాల్ రెడ్డిని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ గురువారం నియమించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

మండల కార్యవర్గం

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాన్ని మండల అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి ప్రకటించారు. మండల కార్యదర్శిగా జేరిపోతుల కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మచ్చ రాజేశం, ఉపాధ్యక్షుడిగా దాసరి రాజయ్య నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుల వెంకట్, బదుగు లింగం, మామిడి నరేశ్ కాసుపాక రమేశ్, ఎండీ.జమాల్, మల్లయ్య, దాసు, పరుశరాములు, ప్రసాద్, రాజు, శ్రీను, రాములు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా కమల్

బోయినపల్లి: మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా గడ్డి కమల్, కార్యదర్శిగా మండల వంశీని నియమిస్తున్నట్లు చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం గురువారం తెలిపారు. వీరికి నియామకపత్రాలను అందజేశారు. తమ నియామకానికి సహకరించిన కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మీయ యువ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూత్ నాయకులు

సిరిసిల్లఅర్బన్/గంభీరావుపేట: ఈ నెల 6న గంభీరావుపేటలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఆత్మీయ యువ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు విద్యార్థి విభాగం నాయకుడు జక్కుల నాగరాజ్ అన్నారు. యువ ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కేటీఆర్ ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి సిరిసిల్ల ముఖచిత్రం మారిందన్నారు. సిరిసిల్లను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చిన ఘనత కేటీఆర్‌ది అని అన్నారు. మెడికల్, జేఎన్టీయూ, వ్యవసాయ కళాశాల, నర్సింగ్, తదితర కళాశాల ఏర్పాటు చేశారన్నారు. మంత్రి కేటీఆర్ హాజరవుతున్న ఈ ఆత్మీయ సమ్మేళనానికి నియోజకవర్గంలోని యువకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూత్ నాయకులు గడ్డమీది శ్రీకాంత్‌రెడ్డి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, గంభీరావుపేట మండల శాఖ అధ్యక్షుడు ఎడబోయిన రత్నాకర్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ బీమా చెక్కు అందజేత



చెక్ అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తంగళ్లపల్లి: ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త అన్నం రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి గురువారం బీఆర్‌ఎస్ పార్టీ రూ.2 లక్షల విలువైన ప్రమాద బీమా చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ కార్యకర్తలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఎంపీపీ పడిగెల మానస, ఏఎంసీ చైర్‌పర్సన్ పూసపెల్లి సరస్వతి, సర్పంచ్ మాట్ల మధు, ఎంపీటీసీ చెన్నమనేని వెంకటరావు పాల్గొన్నారు.

ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి, ఎల్లారెడ్డిపేటలో గురువారం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50 వేల నగదుకు ఎక్కువగా కలిగి ఉంటే సీజ్ చేస్తామన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రయాణాలు చేస్తే వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. ప్రతి వాహనదారుడు వెంట సరైనా ధ్రువీకరణపత్రాలు ఉంచుకోవాలన్నారు.

అభ్యంతరకర పోస్టులు పెడితే చర్యలు తప్పవు

పోలీసు హెచ్చరికలు జారీ

వేములవాడ/వేములవాడరూరల్/ఎల్లారెడ్డిపేట: శాసన సభ ఎన్నికల సందర్భంగా సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన, వివాదాస్పదమైన పోస్టులు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ టౌన్, వేములవాడరూరల్, ఎల్లారెడ్డిపేట సీఐలు కరుణాకర్, కృష్ణకుమార్, శశిధర్‌రెడ్డి హెచ్చరించారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో గురువారం వేర్వేరుగా విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల గడువు దగ్గర పడుతున్న తరుణంలో కొందరు వ్యక్తులు ఉద్దేశ్యపూర్వకంగా ఎదుటివారిని రెచ్చగొట్టే విధంగా అభ్యంతరకరమైన పోస్టులు పెడుతున్నారని, ప్రత్యర్థి రాజకీయ పక్షాలను లక్ష్యంగా చేసుకొని కొన్ని వర్గాల మనోభావాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలని, ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లపై ఏ రకమైన అభ్యంతరకరమైన పోస్టులు పెట్టినా తక్షణమే కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా తప్పుడు ప్రచారాలను చేయవద్దని, శాంతి భద్రతలు రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేసే వారిపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సజావుగా జరిగే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు బ్లాక్ చేస్తాం

ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మండల పరిషత్ బయట, సెస్ ఆఫీస్ నుంచి తెలంగాణ చౌక్ వరకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రోడ్ బ్లాక్ చేస్తామని వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. మండల పరిషత్ అవరణలోని తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లను ఏర్పాటు చేశారని తెలిపారు. అలాగే 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

గురుకుల పాఠశాల నుంచి బాలుడి మాయం



వికాస్(ఫైల్)

వేములవాడ: సిరిసిల్ల రాజీవ్‌నగర్‌కు చెందిన 14 ఏళ్ల ఏనుగుల వికాస్ వేములవాడలోని గురుకుల పాఠశాల నుంచి కనిపించకుండా పోయినట్లు టౌన్ సీఐ కరుణాకర్ గురువారం విలేకరులకు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న వికాస్ దసరా సెలవులకు ఇంటికి వెళ్లి, తిరిగి గత నెల 29న ఉదయం 10.30 గంటలకు వికాస్ తండ్రి స్కూల్‌లో దింపి వెళ్లినట్లు తెలిపారు. కొంత సమయానికి వికాస్ స్కూల్‌లో కనిపించలేదని టీచర్లు విద్యార్థి తండ్రికి సమాచారం ఇచ్చారన్నారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, బాలుడి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని ఆయన కోరారు.